డా॥ బి.వి. పట్టాభిరామ్ Ph.D.

# కష్టపడి చదవొద్దు

## ఇష్టపడి చదవండి

ఎమెస్కో

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | కష్టపడి చదవొద్దు | ... | 9 |
| 2. | చదువుకి సక్సెస్ ఫార్ములా | ... | 11 |
| 3. | రీడింగ్ టెక్నిక్స్ | ... | 21 |
| 4. | మనసుంటే మార్గాలెన్నో | ... | 29 |
| 5. | ఏకాగ్రత పెంచుకోవటం ఎలా | ... | 41 |
| 6. | చదువుకి ఎంత ఏకాగ్రత కావాలి | ... | 57 |
| 7. | విజయానికి ఆయువుపట్టు | ... | 67 |
| 8. | వికటిస్తున్న ఐదు 'సి'లు | ... | 75 |
| 9. | పాఠాలు చదవటానికి పాతిక సూచనలు | ... | 85 |
| 10. | ఇష్టమైతే అన్నీ జ్ఞాపకం | ... | 89 |
| 11. | అర్థంలేని భయాలు వద్దు | ... | 97 |
| 12. | దిద్దేవారికీ ఒక పద్ధతి ఉంది | ... | 117 |
| 13. | మీ సెంటరింగ్ సరిచేసుకోండి | ... | 121 |
| 14. | స్నేహాలు మోహాలుగా మారనివ్వకండి | ... | 137 |
| 15. | మీ సత్తా చూపండి | ... | 145 |
| 16. | మీ కలలను సాకారం చేసుకోండి | ... | 149 |

# కష్టపడి చదవొద్దు

"నేను తెలుగుమీడియంలో చదువుకున్నాను."

"నేను ఫలానా స్కూల్లో చదివి ఉంటే బాగుండేది."

"నేను స్పీడుగా చదవలేను."

"ఈ టెక్ట్స్ పుస్తకాలు చూస్తుంటే భయమేస్తుంది."

"పరీక్షల పేరెత్తగానే కడుపులో కంగారుపుడుతోంది."

"ఎంత చదివినా మర్చిపోతున్నాను."

"చదువు ఎలా ప్లానింగ్ చేసుకోవాలో తెలియటంలేదు."

"నాది మరీ సున్నిత స్వభావం."

"మా ఫ్రెండ్స్ నన్ను చులకన చేస్తున్నారు."

"మా ఇంట్లో ఎవ్వరూ చదువుకోలేదు."

"బాగా చదువుకున్నవాళ్ళని చూస్తే నాకు భయం."

"నాకు చదువురాదేమోననిపిస్తుంది."

"పుస్తకం తెరవగానే నిద్రవస్తుంది."

"అసలు ఎలా చదవాలో అర్థంకావటంలేదు."

"మాది పేద కుటుంబం."

"మా టీచర్లు నన్ను అర్థం చేసుకోవటంలేదు."

.... ఏ స్కూలికెళ్ళినా, ఏ కాలేజికి వెళ్ళినా, నా కార్యక్రమం అనంతరం నన్ను చుట్టుముట్టే పిల్లల ప్రశ్నలివే. “మేము ఎందుకు చదవలేకపోతున్నాము?”, “మాకెందుకిలా అవుతూంది?”, “అసలు భవిష్యత్తు తలుచుకుంటేనే భయమేస్తుంది”, “మా తల్లిదండ్రులెంత బాధపడుతున్నారో!”.... ఇలా వాళ్ళు వేసే ప్రశ్నలు వింటూంటే చిత్రంగా వుంటుంది. ఎందుకంటే వారి సమస్యలు మరెవరో సృష్టించినవి కాదు. ఎటువంటి కుట్రలేదు. అన్నీ స్వయంకల్పితాలే. కొన్నిమాత్రం మనచేతిలో లేనివి, మరికొన్ని జరిగిపోయినవి, వాటిగురించి చింతపడటం అనవసరం. అవి చెయ్యిదాటిపోయాయి.

**కిం కర్తవ్యం?**

నిన్న జరిగిన ఏ ఒక్క సంఘటనను కూడా నేడు మార్చుకోలేము. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చెయ్యాలి? అది ఆలోచించాలి. ప్రస్తుత కర్తవ్యం ఆలోచించాలి. చక్కని ప్రణాళిక వెయ్యాలి. దానికి మొదటి అడుగు

క...ష్ట...ప.....డి........ చ....ద....వొ....ద్దు.

**మరెలా?**

పైకి రావాలంటే కష్టపడకపోతే ఎలా? పగలూ రాత్రీ కష్టపడి, చెమటోడ్చి చదవకపోతే ఎలా? అనుకోకండి. దానికొక మార్గం ఉంది. ఈ పుస్తకంలోని మూలమంత్రం అదే.

**ఇ...ష్ట...ప.....డి........ చ....ద...వం...డి.**

గుడ్‌లక్.

# చదువుకి సక్సెస్ ఫార్ములా

1965 నుండి 1995 దాకా నేను అమలాపురం నుండి అమెరికా వరకు ఉన్న ముఖ్యపట్టణాల్లో మేజిక్ ప్రదర్శనలు చేసేవాడిని. ఆ సందర్భంగా నేను ఎందరో మేధావులను, రాజకీయ నాయకులు, గృహిణులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థినీ విద్యార్థులను కలిసేవాడిని. ప్రదర్శన చూసినవారు బాగుందనో, బాగోలేదనో, ఇంప్రూవ్ చెయ్యాలనో, మేజిక్ ఒక క్షుద్రవిద్య కాబట్టి విడిచిపెట్టమనో... వారికి తోచిన సలహాలు ఇచ్చేవారు. కానీ నేను ఇప్పటికీ మర్చిపోలేని సంఘటన ఒకటుంది. అది నన్ను బాగా ఆలోచించేలా చేసింది. నిజం చెప్పాలంటే నా కెరీర్‌ని ఒక మలుపు తిప్పింది.

1983లో మన తెలుగు సంఘం ఆధ్వర్యంలో వాషింగ్‌టన్‌లో ఒక ప్రదర్శన చేశాను. శ్రీ గుమ్మలూరి శాస్త్రిగారు అధ్యక్షులుగా ఆయన నన్ను పరిచయం చేస్తూ "పట్టాభిరామ్ కొన్ని అద్భుత ప్రదర్శనలు చేస్తారు.. అది చేస్తారు.. ఇది చేస్తారు" అని అభిమానంతో చెప్పారు. ప్రదర్శన కూడా చాలా తృప్తికరంగా చేశాను.

ప్రదర్శన అయ్యాక ఒక పదేళ్ళ అబ్బాయి వచ్చి, "అంకుల్ మీరు పావురాలు సృష్టించారు, మాయం చేశారు. గాలిలోంచి నాణాలు, నగలు సృష్టించారు. మనిషిని ముక్కలు చేసి అతికించారు. కళ్ళకు గంతలు కట్టుకుని బోర్డుమీద ఉన్నవి చదివారు, చివరకు ప్రేక్షకుల మనసులో ఏమనుకుంటున్నారో చెప్పారు... ఇవన్నీ పక్కన పెట్టండి. నాదో ప్రశ్న ఉంది" అని ఆగాడు. ఏమై ఉంటుందా? అని అతనివైపు చూశాను.

"స్టూడెంట్స్ చాలా బాగా చదవటానికి మీ వద్ద ఏదైనా "మేజిక్ ఫార్ములా" ఉందా? అది చెప్పండి. మీ మేజిక్కులు కొన్ని నాకూ వచ్చు. నాకు చదువుకి సంబంధించిన మేజిక్ చెప్పండి" అని అడిగాడు. ఆ క్షణంలో నవ్వుతూ ఏదో చెప్పి పంపించేశాను. దాని గురించి అంతగా ఆలోచించలేదు. కానీ రాను రాను చాలా మంది విద్యార్థులు అలాంటివి అడుగుతుంటే ఆలోచించసాగాను.